క్లుప్తంగా

తెనాలిలో 'జోయాలుక్కాస్' ఆభరణాల ప్రదర్శన



తెనాలి: ప్రఖ్యాత బంగారు ఆభరణాల సంస్థ జోయాలుక్కాస్ తెనాలిలోని గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో మూడురోజుల బంగారు ఆభరణాల ప్రదర్శనను శనివారం స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. జోయాలుక్కాస్ రీజనల్ మేనేజర్ ఐఎస్ రెజిష్, ఇతర అతిథుల సమక్షంలో ఆభరణాల ప్రదర్శన ప్రారంభోత్సవం వైభవంగా జరిగిది. తొలిరోజుల పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు ప్రదర్శనను తిలకించారు. ఆది, సోమవారాలు కూడా ఈ ప్రదర్శన ఉంటుందని, తెనాలి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ రీజనల్ మేనేజర్ రెజిష్ కోరారు.

అమరవీరులకు రోటరీ క్లబ్ నివాళి



తెనాలి: క్విట్ ఇండియా ఉద్యమ అమరవీరులకు రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఇక్కడి రణరంగ చౌక్‌లోని అమరవీరుల స్థూపాల వద్ద పుష్పగుచ్ఛాల నుంచి శ్రద్ధాంజలి ఘటించారు. అమరవీరుల తెగువను, వారి త్యాగాన్ని స్మరించుకున్నారు. క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీ కృష్ణ మాట్లాడుతూ క్విట్ ఇండియా అమరవీరుల త్యాగాలను నేటితరం స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు నాటి ఉద్యమంలో 1942 ఆగస్టు 12న జరిగిన ఆందోళన, పోలీసు కాల్పులను వివరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ, డాక్టర్ పావనీ ప్రియాంక, రోటరీ 3150 డిస్ట్రిక్ట్ న్యూ క్లబ్ చైర్మన్ ఈదర వెంకట పూర్ణచంద్, జెట్టి శివ రామకృష్ణప్రసాద్, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డైలాగ్ పోటీలు

తెనాలిరూరల్: స్టూడెంట్ సందడి ప్రోగ్రామ్ బృందం ఆధ్వర్యంలో పట్టణంలో ప్రతి రెండో శనివారం నిర్వహిస్తున్న వివిధ పోటీల్లో భాగంగా శనివారం విద్యార్థులకు డైలాగ్ పోటీలు నిర్వహించారు. స్థానిక పెన్షనర్స్ హాలులో జరిగిన కార్యక్రమంలో పలు పాఠశాలు, కళాశాల విద్యార్థులు హాజరయ్యారు. సెప్టెంబర్ 9వ తేదీన స్కిట్‌ల పోటీలు నిర్వహించనున్నటుట నిర్వాహకులు తెలిపారు. వెంపటి సత్యనారాయణ, అయినాల మల్లేశ్వరరావు, బొమ్మదేవర వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పర్యవేక్షించారు.

అమరవీరులకు కాంగ్రెస్ నాయకుల నివాళి

తెనాలిరూరల్: స్థానిక రణరంగచౌక్‌లోని అమర వీరుల స్థూపాల వద్ద కాంగ్రెస్ నాయకులు శనివారం నివాళులర్పించారు. క్విట్‌ఇండియా ఉద్యమంలో బ్రిటీష్ పోలీసుల తూటాలకు నేలకొరిగిన ఏడుగురు అమరవీరులను స్మరించుకుని వారి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్వాతంత్రోద్యమ సంగ్రామంలో ఈ ప్రాంత ప్రజల పోరాటాన్ని కినియాడుతూ అమరవీరులకు నివాళులర్పించారు. బ్రిటిష్ తూటాలకు ఎదురొడ్డి ప్రాణాలు సైతం పణంగా పెట్టిన అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని డాక్టందు సాంబశివుడు పేర్కొన్నారు. పొన్నూరు నాగసూర్య శశిధరరావు, కె.బుల్లయ్య, ఎ.కృష్ణారావు, పి.స్టీవెన్‌బాబు, వి.శంకరరావు, కె.వీరయ్య, బి.శ్రీను, నామన మల్లికార్జునరావు, కె.వీరాస్వామి పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'ఎంవీరాజు పాలెం'

కర్లపాలెం: ఎంవీ రాజుపాలెం యూత్ ఆధ్వర్యంలో స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల పరిధిలో జరిగిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఈ టోర్నమెంటులో ఎంవీరాజుపాలెం టీం విజయం సాధించింది. మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గుంట్రెడ్డి శివ రూ.20వేల నగదు, కప్పు అందజేశారు. రన్నర్ ఏట్రవారిపాలెం టీంకు పెట్రోల్ బంక్ ఓనర్ రవి రూ.15 వేల నగదును అందజేశారు. అలాగే తృతీయ స్థానంలో నిలిచిన పెదపులుగువారిపాలెం టీమ్‌కు రూ.10 వేలు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.5 వేలు, 3 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆట్ల నాగిరెడ్డి, తుమ్మా సుబ్రమణ్యంరెడ్డి, ఆట్ల రాజేంద్రరెడ్డి, గోపిరెడ్డి, బాజీరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

జనం గుండె చప్పుడు గద్దర్

బాపట్ల: ప్రజా వాగ్గేయకారుడు, పీడిత ప్రజల గొంతుక గద్దర్ తూటా లాంటి పాట పీడిత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుందని బహుజన కెరటాలు వ్యవస్థాపకుడు పల్నాటి శ్రీరాములు అన్నారు. శనివారం అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు గుదే రాజారావు అధ్యక్షతన స్థానిక అంబేడ్కర్ భవన్‌లో గద్దర్ సంస్మరణ సభ జరిగింది. ఈ సభలో మేకల ప్రసాద్, కాగిత కోటేశ్వరరావు, గద్దం ఏలియా, అబ్రహం లింకన్, అడ్వకేట్ బాషా, పఠాన్ రాజేష్ పాల్గొన్నారు.

క్విట్ ఇండియా అమరులారా.. జోహార్

- అమరవీరుల స్థూపాల వద్ద నివాళులర్పించిన మంత్రి అంబటి రాంబాబు
- హాజరైన జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, ఇతర ప్రముఖులు
- బహిరంగ సభలో వివిధ రంగాల ప్రముఖులకు సత్కారం



అమరవీరుడు భాస్కరుని లక్ష్మీనారాయణ మనమడు హరిబాబు దంపతులను సత్కరిస్తున్న మంత్రి



కానిస్టేబుల్ రమేష్ తండ్రి బసవయ్యను సత్కరిస్తున్న దృశ్యం

తెనాలి: క్విట్‌ఇండియా ఉద్యమంలో భాగంగా తెనాలిలో 1942 ఆగస్టు 12న జరిగిన పోరులో మృతిచెందిన ఏడుగురు అమరవీరులకు శనివారం శ్రద్ధాంజలి ఘటించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరిగిన వీరసంస్మరణ దినోత్సవంలో భాగంగా ఇక్కడి రణరంగచౌక్‌లోని అమరవీరుల స్థూపాల వద్ద రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌లు పుష్పగుచ్ఛాలనుంచి శ్రద్ధాంజలి ఘటించారు. అమరవీరులకు జోహార్లు చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్‌చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కమిషనర్ ఎం.జస్వంతరావు, మండల తహసీల్దారు కె.రవిబాబు, వార్డు కౌన్సిలరు పేరం సంజీవరెడ్డి డీఎస్పీ బి.జనార్ధనరావు, మండల తహసీల్దార్ కె.రవిబాబు, ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ కుమార్ ఉమాశంకర్ పాల్గొన్నారు. తొలుత గాంధీచౌక్‌లో గాంధీజీ విగ్రహానికి పూలమాల సమర్పించిన ఎమ్మెల్యే శివకుమార్, జాతీయ పతాకంతో సహా పాదయాత్రకు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి మాజీ సైనికులు, ఎన్‌సీసీ క్యాడెట్లు కవాతుతో రణరంగచౌక్‌కు వచ్చారు. ఎన్‌సీసీ క్యాడెట్లు గౌరవ వందనంతో సహా అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు.

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. తదుపరి వివిధ రంగాల ప్రముఖులను మంత్రి అంబటి రాంబాబు చేతులమీదుగా సత్కరించారు. సత్కారం అందుకున్న వారిలో అమరవీరుల్లో ఒకరైన భాస్కరుని లక్ష్మీనారాయణ మనువడు భాస్కరుని హరిబాబు దంపతులు ఉండటం విశేషం. వీరితోపాటు మాజీ సైనికులు యలవర్తి ఉమామహేశ్వరరావు, పినపాటి రత్నం, ఎస్‌కే అఖిలను సన్మానించారు. వైద్యరంగం నుంచి కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుబ్బారావు, స్టాఫ్‌నర్సు బి.వనజను సత్కరించారు. ఇటీవల వైకుంఠపురంలో జరిగిన దొంగతనం కేసులో దొంగను పట్టుకునే సమయంలో దొంగ తోసేయటంతో గాయపడి ఆసుపత్రిలో ఉన్న వన్‌టౌన్ కానిస్టేబుల్ యార్లగడ్డ రమేష్‌బాబు తరపున ఆయన తండ్రి బసవయ్యను మంత్రి సన్మానించారు. స్వచ్ఛంద సేవ విభాగంలో స్వధార్ కేంద్రం సిస్టర్ హృదయమేరి సత్కారం అందుకోగా, విద్యారంగం నుంచి ఇటీవలే డాక్టరేట్ తీసుకున్న డాక్టర్ దాసరి విజయలక్ష్మి, శాస్త్రీయ సంగీతంలో కానూరి వెంకట రామకృష్ణ, శాస్త్రీయ నృత్య విభాగంలో డాక్టర్ చల్లా బాలత్రిపురసుందరిని సత్కరించారు. ప్రముఖ హరికథకురాలు మొగిలిచర్ల నాగమణి, పౌరాణిక నటి షేక్ తిరుమలబి, సాంఘిక నటుడు అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, రంగస్థల సంగీత దర్శకుడు దీపాల సుబ్రహ్మణ్యం, క్రీడాశిక్షకుడు కె.నాగరాజు, క్రికెట్ క్రీడాకారిణి కె.మేఘన, ఇనుప వ్యర్థాలతో అద్భుత శిల్పాలను తీర్చిదిద్దుతున్న ప్రముఖ శిల్పి కాటూరి రవిచంద్ర, కొల్లిపరకు చెందిన యోగ గురువు బొంతు కృష్ణకుమారి సత్కారం అందుకున్న వారిలో ఉన్నారు.

తొలుత ఆరాధ్యుల కన్న ఆధ్వర్యంలో మున్సిపల్ బాలుర హైస్కూలు విద్యార్థులచే 'మా తెలుగు తల్లి' నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. డాక్టర్ చల్లా బాలత్రిపురసుందరి, ఎ.వెంకటలక్ష్మి శిష్య బృందాలు శాస్త్రీయ నృత్యాంశాలను ప్రదర్శించారు. ఎన్‌సీఆర్‌ఎం స్కూలు విద్యార్థులు బుద్ధ యోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగ చేశారు. కేఎస్‌ఎం చెంచుపేట విద్యార్థులు జానపద నృత్యం చేశారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ వంపుగళ్ల కృష్ణ, ఆరిగ చంద్రారెడ్డి, తాడిబోయిన రమేష్, సిరికృష్ణ, కాకి దేవసహాయం, కౌన్సిలరు గొడవర్తి సాయిహరేరామ్, షేక్ సాయిబాబు, కఠారి హరీష్, చుండూరు సాయి, కృష్ణబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, జకీరా తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకు సంక్షేమ పథకాలు

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు
- పూడివాడలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



పూడివాడలో వృద్ధురాలికి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎంపీ మోపిదేవి

నగరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకు చేరుతున్నాయని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు చెప్పారు. మండలంలోని పూడివాడ, పడమటిపాలెం, ఉత్తరపాలెం, ఎస్సీ కాలనీలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలకు త్వరితగతిన పరిష్కారమార్గాలను చూపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాల కోసం ప్రజలు దళారులు చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎలాంటి అవినీతికి తావులేకుండా, అధికారులు చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా ఇంటి వద్దకే నేరుగా సంక్షేమ పథకాలు వస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నట్లు ఎంపీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పూడివాడ, పడమటపాలెం, ఉత్తరపాలెం గ్రామాలలో 700 గృహాలను ఎంపీ సందర్శించి, సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు మోపిదేవి రాజీవ్, సర్పంచ్ పాగోలు సుజాత, తహసీల్దారు ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోండి

కొల్లిపర: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంట వివరాలను తప్పనిసరిగా ఈ క్రాఫ్ బుకింగ్ చేయించుకోవాలని ఏవో కె.వెంకటరావు తెలిపారు. గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రస్తుతం ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్నారన్నారు. ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవడం వల్ల వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సేవలకు అర్హత వస్తుందన్నారు. ఆయా గ్రామాల్లోని రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, సెల్‌ఫోన్ తీసుకెళ్లాలన్నారు.

తెనాలిలో భారత్ బచావో జిల్లా మహాసభ

తెనాలిరూరల్: స్థానిక ఎన్జీవో కళ్యాణ మండపంలో భారత్‌బచావో జిల్లా మహా సభను శనివారం నిర్వహించారు. ప్రొఫెసర్ అబ్దుల్ నూర్‌బాషా, డాక్టర్ ఎం.ఎఫ్ గోపినాథ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మహాసభలో సందర్భంగా ప్రజా యుద్ధనౌక దివంగత డద్దర్‌కు నివాళులర్పించారు. ప్రత్యూష సుబ్బరావు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, పి. పోలేశ్వరరావు, అందె శ్యామ్, కె. బెన్‌హర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

బాపట్ల ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో శనివారం నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్‌జిందాల్ ఒక ప్రకటనలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జిల్లాలో 67 బ్లాక్ స్పాట్స్, యాక్సిడెంట్ ప్రోన్ ప్రాంతాలను గుర్తించామని తెలిపారు. తప్పనిసరిగా సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించాలన్నారు.

ఆరోగ్యం కుదటపడుతోంది

- ఇంటికొస్తున్న 'ఫ్యామిలీ డాక్టర్'
- అవ్వతాతలు, దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యంపై నిత్య పర్యవేక్షణ
- సకాలంలో ఉచితంగా మందులు, పరీక్షలు
- తగ్గిన వైద్య ఖర్చులు, పేదల్లో భరోసా నింపిన ప్రభుత్వం
- పెద్దకొడుకులా సీఎం వైఎస్ జగన్ ఉన్నాడనే ధీమా



ఇంటి వద్ద వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు (ఫైల్)

వేమూరు: సగటు మనిషి తన సంపాదనలో సింహభాగం విద్య, వైద్యానికే ఖర్చు చేస్తున్నాడు. రాష్ట్రంలో గత ప్రభుత్వం ఈ రెండు రంగాలను పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆరోగ్య శ్రీని మూలనపడేసి, ప్రజా ఆరోగ్యాన్ని గాలికొదిలేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక విద్య, వైద్యానికి పెద్దపీట వేసింది. పాదయాత్రలో పేదలు కష్టాలు విన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చాక.. నాడు – నేడు పేరుతో పాఠశాలలు, ఆసుపత్రుల భవనాలను పూర్తిస్థాయిలో ఆధునీకరించారు.

అత్యధికంగా నిధులు వెచ్చించి, కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించారు. ఇంతటితో ఆగిపోకుండా ఇంటి వద్దకే వైద్య సేవలను అందించాలనే సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. ఫ్యామిలీ డాక్టరు విధానంతో ప్రజలకు మేరుగైన వైద్య సేవలను అందిస్తున్నారు. ఇంటి వద్దనే ఉండే అవ్వతాతలకు, ఆరోగ్య రిత్యా ఇల్లు కదల్లేని రోగులకు ఇది ఒక వరంలా మారింది. ఇంటికొచ్చి..నాడి పట్టి.. ఆరోగ్యాన్ని ఆరా తీసి, సకాలంలో మందులు అందిస్తున్న వైద్యులను చూసి తమకు ఒక భరోసా లభించిందంటూ వారు సంతోష పడుతున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో పల్లెల్లో ఉండే రోగులకు వైద్య ఖర్చులు చాలా వరకు తగ్గాయి. ముఖ్యంగా బీపీ, షుగర్, తదితర దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారికి పల్లెదాటే పనిలేకుండా భారీ ఉపశమనమే లభించింది. ఖర్చులు తగ్గి.. ఆరోగ్యంపై చింత లేకుండా ప్రభుత్వం చేసింది. మంచానికి పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులు, ఆరోగ్య శ్రీ రోగుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. తగు సూచనలను వైద్యులు అందిస్తున్నారు. 14 రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. వేమూరు మండలంలో 14 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలోని 17 పంచాయతీల్లో ఫ్యామిలీ డాక్టర్ సర్వేను ఆరోగ్య సిబ్బంది పూర్తి చేశారు. దీంతో పాటు ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఆరోగ్య సేవలు ఇలా..

వేమూరు మండలం కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రం, పెరవలిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా పేదలకు వైద్య సేవలు అందుతున్నాయి. పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు వైద్య సేవలు అందిస్తున్నారు. సగటున రోజుకు 1500 మంది వైద్య చేయించుకుంటున్నారు.

మాలాంటి వారి మేలు జరిగింది



నేను కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నా. నాకు షుగర్ ఉంది. గతంలో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి మందులు తెచ్చుకునేదాన్ని. ప్రస్తుతం 104 వాహనం ద్వారా, ఫ్యామిలీ డాక్టరు పేరుతో మందులు ఉచితంగా ఇస్తున్నారు. ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాలాంటి వారికి మేలు చేసింది. మాకు ఖర్చులు, ఇబ్బందులు తప్పాయి. పేదవారిని అదుకోవడం సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– బందెల భారతి, వెల్లబాడు గ్రామం, వేమూరు.

ఆరోగ్యం కుదుటపడింది



నా వయస్సు 65 సంవత్సరాలు. కీళ్ల నొప్పలతో బాధపడుతున్నా. వేమూరు ఆస్పత్రులకు వెళ్లాంటే చాల కష్ట పడాల్సి వచ్చేది. ఇప్పుడు 104 వాహనం నెలకు రెండు సార్లు వస్తోంది. డాక్టరు స్వయంగా వచ్చి పరీక్షలు చేస్తున్నారు. దీంతో ఆరోగ్యం కుదుటపడుతోంది. మాలాంటి వృద్ధులకు సకాలంలో వైద్యం అందుతోంది. సీఎం వైఎస్ జగన్ పేదల ఇంటికి ఒక పెద్ద కొడుకులా అన్నితానై చూసుకుంటున్నారు.

– తాడిబోయిన అంకమరావు, జంపని, వేమూరు.

వర్షం.. హర్షం



కంద పంటలో నిలిచిన వర్షపు నీరు



రేపల్లె ప్రధాన రహదారి ఇలా..



రేపల్లెలో జలమయమైన రోడ్డుపై వెళ్తున్న బస్సు

కొల్లూరు: ఖరీఫ్ సాగు ముమ్మరమైన తరుణంలో వర్షాలు కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంటకు అవసరమైన సాగు నీరు వర్షాల వల్ల పుష్కలంగా లభిస్తుండటంతో మాగాణి, మెట్ట భూముల్లో సాగులో ఉన్న వాణిజ్య పంటలకు మేలు చేకూర్చనున్నాయి. శనివారం మండలంలో కురిసిన భారీ వర్షానికి పంట పొలాలు నీటితో కళకళలాడాయి. నిన్నటి వరకు తీవ్రమైన ఎండలు, గాల్పులకు వడ భారిన పంటలు జీవకళను సంతరించుకొంటాయన్న ఆశాభావం రైతుల్లో వ్యక్తమవుతుంది. ప్రస్తుతం సుమారు ఆరు వేలకు పైగా ఎకరాలలో అరటి, కంద, తమల పాకు, పసుపు, జామ, బొప్పాయి, కూరగాయలు వంటి పంటలు సాగులో ఉన్నాయి. ఈ పంటలకు నిత్యం బోర్లు సాయంతో సాగు నీరందించుకునే రైతులకు వర్షం వల్ల కొంత ఊరట లభించింది. మొక్క దశలో ఉన్న కంద, అరటి, పసుపు పంటలకు రైతులు ఎరువులు చల్లుకునే పనిలో నిమగ్నమవుతున్నారు.

భారీ వర్షం.. రహదారులు జలమయం

రేపల్లె: బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడటంతో పట్టణంలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షంతో పలు ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచింది. పట్టణంలోని ప్రధాన రహదారులైన పద్మావతి టాకీసు సెంటరు, మున్సిపల్ ఆఫీస్ రోడ్డు, నిజాంపట్నం రోడ్డులో గంటల కొద్ది వర్షపునీరు నిలవటంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. లోతట్టు ప్రాంతాలైన ఇందిరా యానాది కాలనీ, లంబాడీ కాలనీ, ఐవీ కాలనీలలో వర్షపు నీరు చేరింది. రేపల్లెలో 46.2 మిల్లీమీటర్లు, నిజాంపట్నంలో 43.6 మిల్లీమీటర్లు, చెరుకుపల్లిలో 39.4 మిల్లీమీటర్ల, నగరంలో 12.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గత పది రోజులుగా వేసవిని తలపించేలా ఉన్న వేడిమి నుంచి వర్షంతో ఉపశమనం కలిగింది.

'క్విట్ ఇండియా'లో బాపట్లది అద్వితీయమైన పాత్ర



స్వాతంత్ర సమరయోధుల శిలాఫలకాలకు నివాళులర్పిస్తున్న డాక్టరు పీసీ సాయిబాబు

బాపట్ల: బాపట్ల ప్రాంతంలో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమం అద్వితీయమైనదని ఫోరంఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టరు పి.సి.సాయిబాబు పేర్కొన్నారు. క్విట్‌ఇండియా ఉద్యమం సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన సమరయోధుల స్మారక శిలా ఫలకానికి శనివారం పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టరు సాయిబాబు మాట్లాడుతూ 1942 ఆగస్టు 12న బాపట్లలో క్విట్ ఇండియా ఉద్యమం పెద్ద ఎత్తున జరిగిందని తెలిపారు. ఉద్రిక్తమైన జన సమూహాలు బాపట్ల రైల్వే స్టేషన్‌పై దాడి చేసి ఇన్సులేటర్లను, టెలిగ్రాఫ్ స్తంభాలను, టెలిఫోన్ పరికరాలను ధ్వంసం చేశారని గుర్తు చేశారు. అంతకు ముందు ప్రజలు బాపట్ల సబ్ కోర్టుపై దాడి చేశారు. నాళం రామచంద్రరావు సబ్ జడ్జి కుర్చీలో కూర్చొని బాపట్ల స్వతంత్ర్య పట్టణమని ప్రకటించారని తెలిపారు. వీఎల్ సుందరరావు, దేశిరాజుశర్మలు బాపట్ల తాలూకా ప్రాంతమంతా పర్యటించి, ప్రజలను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా పలువురు నిర్బంధంలోకి తీసుకోబడ్డారని చెప్పారు. క్విట్ ఇండియా 81వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు భాస్కరరావు, ఉపాధ్యాయ సంఘాల ఫెడరేషన్ నాయకులు బడుగు శ్రీనివాసరావు, వెంకటేశ్వర రెడ్డి, వినయ్, సురేష్, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత న్యాయసలహా శిబిరం



బ్రోచర్‌ను ఆవిష్కరించిన కమిటీల నేతలు

తెనాలి: పట్టణ ఆర్యవైశ్య సంఘం, తెనాలి పట్టణ ఆర్యవైశ్య లీగల్ సెల్ సంయుక్తంగా ఆదివారం న్యాయసలహా శిబిరం నిర్వహించనున్నారు. స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవ స్థానం ప్రాంగణంలో గల పద్మనాభుని కోటయ్య కల్యాణ మండపంలో ఉదయం శిబిరం ప్రారంభిస్తున్నట్టు ఆయా కమిటీల నాయకులు విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవాకార్యక్రమాల్లో భాగంగానే పట్టణ ప్రజలందరికీ ఉపయోగపడేలా న్యాయ సలహా శిబిరాన్ని జరుపుతున్నట్టు సంఘం అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు తెలిపారు. తమ వ్యక్తిగత, ఆస్తులకు సంబంధించిన న్యాయ సహాయం అవసరమైన వారు శిబిరానికి వచ్చి, తగిన సలహాలు సూచనలు పొందవచ్చని వివరించారు. కులమతాలకు అతీతంగా ఎవరైనా ఈ శిబిరానికి రావొచ్చని తెలిపారు. దరిశి శివకోటేశ్వర రావు, గ్రంధి జయరామకృష్ణ, సంకా ఆంజనేయులు, ఆతుకూరి పూర్ణచంద్రరావు, కర్నూరపు రఘునాథ గుప్తా, మువ్వల శ్రీనివాసరావు గుప్తా, గట్టా వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు. న్యాయలసహా శిబిరం బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

గాలివాన ధాటికి కూలిన విద్యుత్ స్తంభాలు



అనంతవరంలో విరిగిపడిన స్తంభం



సీసీ రోడ్డుపై అడ్డంగా కూలిన విద్యుత్తు స్తంభం

కొల్లూరు: పెనుగాలితో కూడిన వర్షం ధాటికి విద్యుత్తు స్థంభాలు కూలి, విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. శనివారం సాయంత్రం గాలితో కూడిన వర్షానికి మండలంలోని అనంతవరం, ఈపూరులంక, మొసలిపాడు, గాజుల్లంక గ్రామాల పరిధిలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పంట పొలాల్లో భారీ వృక్షాలు కూలడంతో విద్యుత్ తీగ తీగలు ఎక్కడికక్కడ తెగిపోయాయి. అనంతవరం గ్రామంలో సీసీ రోడ్లపై పోల్స్ పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారు 15 స్తంభాలు వరకు విరిగి పడటం, ధ్వంసమవడంతో విద్యుత్తు శాఖ సిబ్బంది విద్యుత్తు సరఫరా పునరుద్ధరణకు రాత్రి వేళలో కూడా మరమ్మతులు చేస్తున్నారు. సుమారు రూ. 3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు కొల్లూరు ట్రాన్స్‌కో ఏఈ కె. సుధాకర్‌బాబు తెలిపారు.

రీ-వెరిఫికేషన్‌పై సమీక్ష

భట్టిప్రోలు: ఓటర్ల రీ-వెరిఫికేషన్‌పై బీఎల్వోలు, వీఆర్వోలతో భట్టిప్రోలు తహసీల్దారు డి.వెంకటేశ్వరరావు శనివారం సమీక్ష నిర్వహించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో ఆయన మాట్లాడుతూ ఈ నెల 21లోగా వెరిఫికేషన్ పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో పలువురు పాల్గొన్నారు.